జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 29-7-2025 శ్రీకాకుళం సంపుటి: 2 సంచిక: 409 పేజీలు: 4 వెల : రూ.7


## టీపీవో సస్పెన్షన్

**ఇచ్ఛాపురం, జూలై 28 (వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న సనప వినయ్ ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2021లో గాజువాకలో ప్రస్తుత ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకి చెందిన ఆస్తులను కూల్చి వేసిన ఘటనలో అప్పటి టీపీఎస్‌గా పనిచేసిన వినయ్ ప్రసాద్‌ను సస్పెన్షన్ చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేశ్ కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు.

## హెల్త్ ఎడ్యుకేటర్ మంగమ్మపై ఎంక్వయిరీ

* వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి
* బయోమెట్రిక్ విధానం తప్పనిసరిగా పాటించాలి
* డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మేరీ కేథరిన్

**వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, జూలై28 (వార్త):** గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ ఎడ్యుకేటర్‌గా విధులు నిర్వహిస్తున్న మంగమ్మపై ఈనెల 23న 'జాతీయ వార్త'లో ప్రచురితమైన 'మంగమ్మా మాకొద్దమ్మా' శీర్షికన కథనం వెలువడిన విషయం తెలిసిందే. దీనికి జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారులు స్పందించారు. సోమవారం ప్రత్యేక విచారణ బృందం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ మేరీ కేథరిన్, డీఐవో డాక్టర్ రామదాస్‌లు గోవిందపురం పీహెచ్‌సికి వచ్చి విచారణ చేపట్టారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నుంచి లిఖితపూర్వకంగా నివేదికను తీసుకున్నారు. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియా ప్రతినిధులతో వారు మాట్లాడుతూ హెల్త్ ఎడ్యుకేటర్ మంగమ్మపై పూర్తి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సేవలందించాలన్నారు. ఇంటింటికి వైద్య సిబ్బంది తిరిగి రోగుల వివరాలు సేకరించాలన్నారు.

# జగన్ పాలనలో.. అన్నీ స్కామ్‌లే!

* ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి
* ఎవరినీ వదలం
* కార్గో ఎయిర్ పోర్టుతో జిల్లా అభివృద్ధి
* నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు
* రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
* ఎమ్మెల్యే శిరీషతో కలిసి నల్లబొడ్లూరు కొండ పరిశీలన

**మందస/పలాస,జూలై 28(వార్త):** జగన్ రెడ్డి పాలనలో అన్నీ స్కామ్‌లే జరిగాయని, ప్రజలకు మంచి మాత్రం జరగలేదని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఉద్దానంలో ఏర్పాటు చేయనున్న కార్గో ఎయిర్‌పోర్టుతో జిల్లా మరింత ప్రగతి సాధిస్తుందని తెలిపారు. ఎయిర్‌పోర్టు, మూలపేట పోర్టు వల్ల జిల్లా స్వరూపం మారిపోతుందన్నారు. జిల్లా వాసులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. సోమవారం మందస మండలం లోహరిబంద పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం ఏడాది సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్టంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పాలనలో పల్లెల ప్రగతి అభివృద్ధి సాధ్యం అయిందన్నారు. అలాగే నల్లబొడ్లూరు కొండను మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే గౌతు శిరీష పరిశీలించారు. నల్లబొడ్లూరు కొండను వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు అక్రమంగా తవ్వేశారని, ప్రస్తుతం ఈ కొండ మాయమైందన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పలాసలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పనితీరు అభినందనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికి 85 లక్షల ఇళ్లను సందర్శించి, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను వివరించామన్నారు. వారి అభిప్రాయాలను యాప్‌లో పొందుపరిచామన్నారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి ముందుకువెళ్తామన్నారు. త్వరలో రైతులకు అన్నదాత సుఖీభవ పేరిట రూ. 20 వేలను మూడు విడతల్లో అంద జేయనున్నట్లు తెలిపారు. మహిళలకు ఆగస్టు 15 నుంచి ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు పదివేల రూపాయలు అందివ్వనున్నట్లు వెల్లడించారు. జగన్మోహన్‌రెడ్డి నిర్వాకంతో కంపెనీలన్నీ రాష్ట్రం నుంచి తరలి పోయాయన్నారు. మళ్లీ వాటిని తిరిగి తీసుకువచ్చేందుకు సీఎం నారా చంద్రబాబు కృషి చేస్తున్నారని, ఇందులో భాగంగా విదేశీ పర్యటనలు చేస్తూ పెట్టుబడులు తీసుకువస్తున్నారన్నారు. శ్రీకాకుళం జిల్లాలో త్వరలో పోర్టు, కార్గో ఎయిర్‌పోర్టు పూర్తయితే ఈ ప్రాంతం అభివృద్ధిలో అగ్రగామిగా మారుతుందన్నారు. అభివృద్ధిని చూసి తట్టుకోలేని వైసీపీ నేతలు అసత్య ప్రచారాలను చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో చేసిన స్కామ్‌లన్నీ బయటపడుతున్నాయని తెలిపారు. 20లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగా ప్రణాళికలు తయారు చేసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, టీడీపీ పరిశీలకుడు చౌదరి బాబ్జి, టీడీపీ నాయకులు లోడగల కామేష్, బడ్డ నాగరాజు, భావన దూర్యోధన, రట్టి లింగరాజు, పీరుకట్ల విఠల్, నవీన్ యాదవ్, ఎల్.రుద్రయ్య, దాసరి తాతారావు, చౌదరి మురళి కృష్ణ, సాలిన మాధవరావు, బైరిశెట్టి గున్నయ్య, తమిరియా భాస్కరరావు, మంగళ పాత్రో తదితరులు పాల్గొన్నారు.






జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## 'ఉచిత బస్సు'పై ప్రభుత్వం పునరాలోచించాలి



**మందస, జులై 28(వార్త):** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని బీమా సలహాదారు, గృహిణి మోణింగి శాంభవి కోరారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. టికెట్ లేని ప్రయాణంతో ఇబ్బందులే తప్ప మేలు జరగదని అభిప్రాయపడ్డారు. ఇళ్లల్లో కూడా సమస్యలు వస్తాయని, అవసరం లేకపోయినా.. కొంతమంది ఉచిత ప్రయాణం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. బాధ్యతలను విస్మరించి, ప్రయాణాలకు అలవాటు పడతారన్నారు. ఇప్పటికే తెలంగాణాలో జరుగుతున్న వింతలు, విశేషాలను సోషల్ మీడియాలో చూస్తున్నామన్నారు. ఈ పథకం అమలు చేయాలంటే మహిళలకు రాయితీ కల్పిస్తే మంచిదన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. వైద్యానికి నిధులు వెచ్చించి ప్రజలకు మేలు చేస్తే బాగుంటుందన్నారు. ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం పథకంపై ఆలోచించి, మార్పులు, చేర్పులైనా చేస్తే మంచిదని శాంభవి పేర్కొన్నారు.

# అంగన్వాడీ కేంద్రమా.. గోదామా..!

**-అధ్వానంగా నిర్వహణ**

**-పట్టించుకోని అధికారులు**

**(సరుబుజ్జిలి)**



సరుబుజ్జిలి మండలంలోని అంగన్వాడీ కార్యాలయాల నిర్వహణ ఎంత దారుణంగా ఉందంటే, అధికారుల బాధ్యతా రాహిత్యం కళ్లకి కట్టినట్లు కనపడు తోంది. సుబ్బపేట అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించగా, గుట్టలుగా బియ్యం బస్తా పోగులు ఉన్నాయి, మరోవైపు ఎమ్.ఎస్. పైపులు, కిటికీలు లేని గదులు. అంగన్వాడీలో ఒక్కరంటే ఒక్కరే వున్నారు. ఆ ఒక్క విద్యార్థి సమయానికి అంగన్వాడీలో లేరు. వివరణ కోసం పీవో గీతకు ఫోన్ చేస్తే ఆమె శ్రీకాకుళం శిక్షణ తరుగతులకి వెళ్లానని, రేపు ఆఫీస్‌లో అందుబాటులో ఉంటానని తెలిపారు.

# ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే సహించేది లేదు

**-శ్రీకాకుళం పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడు కలమట వెంకటరమణ మూర్తి -వసప గ్రామ పరిధిలోని ఇసుక ర్యాంపు నిర్వహణపై మండిపాటు**



**కొత్తూరు, జులై 28(వార్త):** వసప గ్రామ పరిధిలోని ఇసుక ర్యాంపుతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, పంట పొలాలు, ఎరువులు, ఇతర అవసరాలకు వెళ్లేందుకు మార్గం లేకుండా పోయిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని శ్రీకాకుళం పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడు కలమట వెంకటరమణ మూర్తి దృష్టికి వారు తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన కలమట స్థానిక రైతులకు ఇబ్బంది కలిగేలా ర్యాంపు నిర్వహిస్తే, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, అలాంటి చర్యలు సహించేది లేదని హెచ్చరించారు. బలద రెవెన్యూ పరిధికి మంజూరైన ఇసుక ర్యాంప్‌ను వసప గ్రామ సరిహద్దుల్లో ఎలా నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులతో చర్చించి రైతులకు అసౌకర్యం కలగకుండా ర్యాంపు నిర్వహించాలని సూచించారు.

# సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పర్యటన జయప్రదం చేయండి



**మందస, జులై 28(వార్త):** కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ఎనిమిది నెలలుగా చేస్తున్న ఉద్యమానికి సంఘీభావం తెలపడానికి సీపీఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఈనెల 30న వజ్రపు కొత్తూరు, మందస మండలాల పర్యటనకు వస్తున్నారని కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు, ప్రధాన కార్యదర్శి జోగు అప్పారావు తెలిపారు. వజ్రపు కొత్తూరు మండలంలోని ఒంకులూరు నుంచి ఆయన పర్యటన ప్రారంభమవుతుందన్నారు. బాధిత గ్రామాల నుంచి రైతులు, మత్స్యకారులు, ఉద్యమ శ్రేయోభిలాషులందరూ కూడా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు. సమావేశంలో కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ఉపాధ్యక్షుడు లండ రామస్వామి, జోగి శ్రీదేవి, మామిడి తులసయ్య, గుంటు రామస్వామి, గుంటి యోగేష్, కొండ తులసిరావు తదితరులు పాల్గొన్నారు.



## కారులో నాటుసారా రవాణా .. ఇద్దరి అరెస్టు

**మందస, జులై 28(వార్త):** కారులో నాటుసారా రవాణాపై సమాచారం రావడంతో సోంపేట ఎక్సైజ్ సీఐ, మొబైల్ సిబ్బంది కంచిలి మండలంలోని కేసరపడ గ్రామం సమీపంలో ఆంధ్రా–ఒడిశా సరిహద్దు వద్ద ఇండికా కారును పట్టుకున్నారు. అందులో ఆరు ప్లాస్టిక్ గోనె సంచులలో రవాణా చేస్తున్న 900 నాటుసారా ప్యాకెట్లు(90 లీటర్ల నాటుసారా) స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నాటుసారాను రవాణా చేస్తున్న వ్యక్తిని ఒడిశాలోని మున్నిసుపేటకి చెందిన మొగిలికుమార్‌గా గుర్తించారు. కంచిలి మండలంలోని పెద్దశ్రీరాంపురానికి చెందిన లొట్ల జోగారావు నాటుసారాను అమ్మకానికి తెప్పించినట్టుగా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి కారుని సీజ్ చేశామని ఎక్సైజ్ సీఐ జీవీ రమణ తెలిపారు. వీరిని సోంపేట మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా రిమాండ్ విధించారన్నారు. కారుతో పాటు సారాను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బంది మార్కారావు, భాను, అరుణ్, ఉమాపతిని ఆయన అభినందించారు.

## రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు నగరంపల్లి హైస్కూల్ విద్యార్థులు



**పలాస, జులై 28(వార్త):** శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన సౌత్ జోన్ జిల్లా స్థాయి క్రీడా పోటీలలో వజ్రపుకొత్తూరు మండలంలోని నగరంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి బి.కుమారస్వామి లాంగ్ జంప్‌లో ప్రథమస్థానం సాధించడమే కాకుండా 4.43మీటర్ల జంప్‌తో కొత్త జిల్లా రికార్డు నెలకొల్పాడు. 60 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయస్థానం సాధించాడు. తొమ్మిదో తరగతి విద్యార్థి బి.ఉదయ్ జావెలిన్ త్రోలో ద్వితీయ స్థానం సాధించాడు. వీరిరువురు ఆగస్టు 9 నుంచి బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరికి శిక్షకులుగా వ్యాయామ ఉపాధ్యాయులు పి.గజేంద్రరావు, జె. నారాయణరావు వ్యవహరించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కుమార స్వామి, ఉదయ్‌ను ప్రధానోపాధ్యాయులు తలగాన హేమరావు, ఉపాధ్యాయ సిబ్బంది కె.రమణ, టి.యర్రన్న, పి.సోమేశ్వరరావు, కొయ్యల శ్రీనివాసరావు, ఎల్.శ్రీదేవి, జి.నిర్మల, జి.యామిని, సీ.హెచ్.ఉమారావు, వై.కాళిదాసు, హెచ్.కృష్ణా రావు, ఎం.అప్పలరామయ్య, ఎన్.గౌరీనాయుడు, బి.చంద్రశేఖర్, జి.విశ్వనాథం, డీవీఆర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం

**పలాస, జులై 28(వార్త):** ఎంతటి వారైనా, ఏ స్థాయిలో ఉన్న వ్యక్తినైనా విడిచి పెట్టేదే లేదని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. ప్రజల నుంచి వచ్చిన పలు ఫిర్యాదుల మేరకు సోమవారం ఆయన పురపాలక సంఘంలోని పలు ఆక్రమణలను, అక్రమ కట్టడాలను ఆకస్మిక తనిఖీ చేశారు. 3వ వార్డు శివాజీనగర్ కాలనీలో నిర్మాణమవుతున్న సిమెంట్ రోడ్డుపై పలు ఫిర్యాదులు రావడంతో సదరు నిర్మాణ పనులను పరిశీలించారు. పాత జాతీయ రహదారికి ఆనుకొని అనుమతులు లేని భవన నిర్మాణాన్ని తనిఖీ చేశారు. మొగిలిపాడు పంట కాలువ స్థలంలో ఇల్లు నిర్మిస్తున్న యజమానిని పిలిపించి సదరు స్థలము డాక్యుమెంట్లు, ఇతర అనుమతి పత్రాలు తీసుకురమ్మని ఆదేశించారు. 27వ వార్డు రామ లక్ష్మణ కాలనీ ఉలాసపేట వీధి చివర గల భద్రమ్మ కోనేరుకు ఆనుకొని రానాబందలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను తొలగించారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బందితో సమావేశమై పరిస్థితిని సమీక్షించి, సిబ్బందికి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 13 మంది జూదరుల అరెస్టు ..

## భారీ మొత్తంలో నగదు, వాహనాల స్వాధీనం



**కొత్తూరు, జులై 28(వార్త):** నీలకంఠాపురం కొండ ప్రాంతంలోని పేకాట శిబిరాలపై టాస్క్‌ఫోర్స్ సోమవారం దాడులు నిర్వహించింది. వేర్వేరు ప్రదేశాల్లో కలిపి 13 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.1.53లక్షలు, కారు, మూడు బైక్‌లు, ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై గుంపులపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ తెలిపారు. పేకాట శిబిరాలపై నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు.



## తల్లిదండ్రులను గౌరవిస్తేనే సరస్వతీ కటాక్షం

**పలాస, జులై 28(వార్త):** తల్లిదండ్రులను గౌరవిస్తేనే సరస్వతి కటాక్షం లభిస్తుందని జిల్లా వేదం ఇన్‌చార్జి ఎంవీఎస్ మూర్తి అన్నారు. జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రీ ప్రైమరీ విద్యార్థుల తల్లిదండ్రులుకు విద్యార్థులచే పాదపూజ కార్యక్రమం శ్రీ సత్యసాయి విద్యావిహార్ రామకృష్ణపురములో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు గౌరవిస్తేనే సమాజం గౌరవిస్తుందని, అప్పుడే సంఘంలో గౌరవం వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సాధనా శిబిరం జిల్లా ఇన్‌చార్జి జామి శ్రీనివాస్, ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ తాళాసు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ప్రీతీ చౌదరి, తాళాసు సూర్యప్రకాశ్, మద్ది కామేశ్వరరావు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ జర్నలిస్టుగా మాధవ్ ఎంపిక



**మెళియాపుట్టి, జులై 28(వార్త):** ప్రతి ఏటా సాహితీ సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మోటూరు హనుమంతురావు స్మారక ఉత్తమ జర్నలిస్ట్ అవార్డుకు ఆంధ్రజ్యోతి విలేకరి గేదెల మాధవరావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను మండలానికి చెందిన సహచర విలేకరులు సోమవారం దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. మండల అభివృద్ధి అధికారి నరసింహా ప్రసాద్ పండా, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు అనపాన రాజశేఖర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ ప్రతినిధి వాసు, జనసేన పార్టీ నాయకులు బాలరాజులు దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో అయితం మురళి, మాడుగుల వరప్రసాద్, అనపాన నాగిరెడ్డి, డోల క్రాంతి, గూడ రామారావు, జీ జగదీష్, ఎస్.జగదీష్, చాణిక్య, బూరగాన చిన్నబాబు, శంకర్, ఎంపీడీవో సిబ్బంది, బాలరాజు, చంటి, ప్రశాంత్, సత్యనారాయణ రాథో తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ టెండర్లను రద్దు చేయండి

**ఇచ్ఛాపురం, జులై 28(వార్త):** మున్సిపల్ టెండర్లును రద్దు చేయాలని సివిల్ కాంట్రాక్టర్ పేడాడ అప్పలస్వామి కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఆయన గ్రీవెన్సులో సోమవారం ఫిర్యాదు చేశారు.ఈ నెల 4 న జరిగిన టెండర్లలో ఏజెన్సీలు ఫర్మ్‌ల పేరుతో అక్రమ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేశారన్నారు. టెండర్లు రద్దు చేసి ఏడు రోజుల్లో సెకండ్ కాల్ పిలవాలని కోరారు.

## పిజిఆర్ఎస్‌లో 45 దరఖాస్తుల స్వీకరణ

**పలాస, జులై 28(వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో డెత్ సర్టిఫికెట్లు, వితంతు పెన్షన్లు, ఒంటరి మహిళా పెన్షన్ వంటి పలు సమస్యలపై 45 దరఖాస్తులు అందినట్లు మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు తెలిపారు. డెత్ సర్టిఫికెట్లు కొరకు-06, ఒంటరి మహిళా పెన్షన్ లు కొరకు-5, వితంతు పెన్షన్స్ కొరకు-5, దివ్యంగ పెన్షన్స్ కొరకు-2, వృద్ధాప్య పెన్షన్స్ కొరకు-27 దరఖాస్తులు అందాయన్నారు. టిడ్కో ఇళ్లపై ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. ప్రభుత్వం నుంచి తగిన మార్గదర్శకాలు వచ్చిన వెంటనే టిడ్కో ఇళ్ల దరఖాస్తులు పరిష్కరిస్తామని తెలిపారు.




# సమస్యల పరిష్కారానికే ప్రజా వేదిక

**- రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం**

**- ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్**



**జి.సిగడాం, జులై 28(వార్త):** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా సమస్యల వేదిక నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎన్ఈఆర్ పేర్కొన్నారు. సోమవారం నడిమివలస గ్రామంలో నమస్తే ఎచ్చెర్ల, ప్రజా వేదిక కార్యక్రమాలను ఆయన నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వినతులను తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు, నాయకులు కలిసికట్టుగా ఉంటూ పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా ప్రజల నుండి అందిన ప్రతి అర్జీని నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపుతూ, రీఓపెన్ కాకుండా జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపారు. నిర్ణీత గడువు దాటితే చర్యలు ఉంటాయని తెలిపారు. ఎవరైనా అధికారులు నిర్లక్ష్యం వస్తే సంబంధిత శాఖల వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రామకృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ ఎన్.నిర్మల, కూటమి మండల అధ్యక్షులు కుమరాపు రవికుమార్, పైల విష్ణుమూర్తి, మీసాల రవికుమార్, నడిమి వలస గ్రామ నాయకులు మీసాల ముసిలినాయుడు, పొగిరి అప్పలనాయుడు, మీసాల రామకృష్ణ, బాలి తమ్మినాయుడు, స్థానిక సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, సర్పంచ్ ప్రతినిధి ముద్దాడ గౌరీశంకరరావు, నాయకులు బాలబోమ్మ వెంకటేశ్వం౯రావు, భూపతి అర్జున్ కుమార్, బెవర జగన్నాథరావు, కామోజుల సీతారాం, టంకాల మౌళీశ్వరరావు, పైల బాబ్జీనా యుడు, పడాల అప్పన్న, తాలల్ల బత్తుల పైడిరాజు, ఎపీఒ చోళ్ల సత్యనారాయణ, ఏఈలు కుసుమ, యవరాజ్, కుసుమ, లత శ్రీ, సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వంశధార జలాలు ఇచ్ఛాపురం వరకు పొడిగించాలి



**ఇచ్ఛాపురం, జులై 28(వార్త):** వంశధార నదీ జలాలు ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని నియోజకవర్గ రైతు కుల సంఘం కోరింది. జామి ఎల్లమ్మ గుడి వద్ద పలాస నియోజకవర్గ వంశధార సాధన కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. పంట పొలాలకు సాగు నీరందించేందుకు వంశధార జలాలు అను సంధానం చేయాలని కోరారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును కలిసి సమస్య వివ రించేందుకు తీర్మానం చేశారు. కార్యక్రమంలో జన్నెల సూర్య వర ప్రసాద్, ఆశి చిరంజీవులు రెడ్డి, బుడ్డేపు కామేష్ రెడ్డి, మార్పు మన్మథరావు, బాబూరావు, మాధవ రావు, హేమారావు చౌదరి, తిప్పన కూర్మారెడ్డి, బచ్చు రఘునాథ్‌రెడ్డి, దుర్గాసి పాపారావు, మొగిలిపురి సీతాలు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

**శ్రీ రామా సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత**

**కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన**

**పలాస, జులై 28(వార్త):** గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీరామ సేవా సంఘం అధ్యక్షుడు మోస వరప్రసాద్‌రావు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి గ్రామంలో ఆదివారం శ్రీరామా సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరం విజయవంతం చేసిన ప్రజలకు , సహకరించిన ఆశా కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణులు డాక్టర్ అంజలి , డాక్టర్ కావ్యరాణి పర్యవేక్షణలో 212 మందికి నేత్ర పరీక్షలు చేపట్టారు . అందులో 32 మందిని శస్త్ర చికిత్సల నిమిత్తం ఎంపిక చేసినట్లు శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి క్యాంప్ మేనేజర్ టి.రామారావు తెలిపారు. వీరిని శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో మాజీ యం.పి.పి సూరాడ మోహనరావు, శ్రీ రామా సేవా సంఘం కోశాధికారి కాస చలపతిరావు, ప్రధాన కార్యదర్శి అర్జాల ఈశ్వరరావు, శ్రీ అభయాంజనేయ కమిటీ అధ్యక్షులు కోనేరు లోకానాథం నాయుడు, కోశాధికారి కాస సోమశేఖర్, కార్యదర్శి కాస ముకుందరావు, మాజీ ఎంపీటీసీ బర్రి ఉపాధి, మాజీ ఉప సర్పంచ్ సింగుపల్లి బాలకృష్ణ, సంఘం మాజీ అధ్యక్షులు తయ్యి మహేశ్వరరావు, విద్యాభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షులు కోనేరు మోహనరావు, అంబటి దుర్గారావు, సురపతి జగన్నాథం, సంఘం సభ్యులు సూరాడ లోకనాథం, మద్దు మాలయ్య, మద్దు వాసుదేవ్, జోగి ఢిల్లీరాజు, లండ మురళీ, జామి అనిల్, పిన్నాసి శ్రీకాంత్, గండిపల్లి మహేష్, మైలపల్లి అనీష్, ఆశా కార్యకర్తలు కుంది ధనలక్ష్మి , గనగళ్ల కస్తూరి, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## తేజేశ్వరరావు కుటుంబానికి పరామర్శ

**మందస, జులై 28(వార్త):** దున్నవూరు గ్రామానికి చెందిన తామాడ తేజేశ్వరరావు గాజువాకలో జరిగిన ప్రమాదంలో ఇటీవల మరణించారు. ఆయన కుటుంబాన్ని విశాఖ కార్పొరేటర్ మూర్తి, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఆంగ కృష్ణ, మాజీ డైరెక్టర్ జుత్తు నీలకంఠం, వార్డు పెద్దలు రెయ్యి రత్నం సోమవారం పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# సూపర్ సిక్స్‌తో ప్రజలను మోసగించారు

**-కూటమిపై ధ్వజమెత్తిన వైకాపా నాయకులు**

**-మందసలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ**



**మందస, జులై 28(వార్త):** సూపర్ సిక్స్ పథకాలతో అభివృద్ధి చేస్తామని చెప్పిన చంద్రబాబు ప్రజలను మోసం చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. మందసలో జరిగిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బాబు ష్యూరిటీతో ప్రజలకు మోసం చేశారన్నారు. చంద్రబాబు అబద్దాల రాయుడని, ప్రజలను నిలువునా మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఎంత నష్టపోయారో పార్టీ నాయకులు ప్రజలకు వివరించారు. చంద్రబాబును రీకాల్ చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు అబద్దాల రాయుడు-చంద్రబాబు నాయుడు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జడ్పీటీసీ సవర చంద్రమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దల్లి జానకిరావు, జిల్లా కార్యదర్శి అగ్గున్న సూర్యారావు, మందస సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, పార్టీ నాయకులు గిన్ని తిరుపతిరెడ్డి, యువజన అధ్యక్షుడు శానాపతి కిషోర్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు సేనాపతి దివ్య, ఎంపీటీసీ కంచిబెహరా, సవర నీలకంఠం, మడియా రామకృష్ణ, చింతాడ గణపతి, బాడ జగన్నాయకులు, దుంపల వైకుంఠ రావు, కర్రి గోపాలకృష్ణ, సిందిరి జగన్, బత్తిని లక్ష్మణ్, దున్న హరికృష్ణ,, నాగేశ్వర బృందావన్, మద్దిల రామారావు, దువ్వ జగదీష్, గున్న రమణ, తమిరి శోభన్ బాబు, సవర రాము, గుంపు జగదీష్, మామిడి సింహాద్రి, కర్రి వెంకటరావు, తలగాన బ్రదర్స్, కొంటేన ప్రసాద్, దున్న బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



### మశాఖపురంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో

**ఇచ్ఛాపురం, జులై 28(వార్త):** జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ పేరుతో.. రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకుతెస్తూ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, మండల పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖరరెడ్డి, బతకల మోహనదాస్, జానీ, చిరంజీవి, గణేష్, దేవరాజ్, రామయ్య, స్థానిక మహిళలు, వైస్సార్సీపీ కుటుంబసభ్యులు, గ్రామ ప్రజలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



## 17 వ వార్డు లో సుపరిపాలనలో తొలి అడుగు

**ఇచ్ఛాపురం, జులై 28(వార్త):** మున్సిపాలిటీ పరిధి 17వ వార్డు లో సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి జన్నెల సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలం లో చేసిన సంక్షేమం, అభివృద్ధి వివరించారు. కార్యక్రమంలో జిలాని పాల్గొన్నారు.

## ప్రదీప్‌కు ఘన సన్మానం



**ఇచ్ఛాపురం, జులై 28(వార్త):** వైసీపీ నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడుగా గువ్వాడ ప్రదీప్‌కుమార్ నియమించిన సందర్భంగా ఆయనను సోమవారం పాస్టర్ ఫెలోషిప్ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ పార్టీకి మరింత సేవ చేస్తానని, తనను నియమించిన జగన్మోహన్ రెడ్డి, సమన్వయ కార్యకర్త పిరియ విజయ, సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్, నియోజకవర్గ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఫెలోషిప్ అధ్యక్షుడు ప్రభుదాస్, పాస్టర్ సెక్రటరీ సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్‌కు జ్ఞానభారతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నివాళులు




**ఇచ్ఛాపురం, జులై 28(వార్త):** జ్ఞానభారతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, మాజీ చైర్మన్ దివంగత ఆనంద్‌కుమార్ అగర్వాల్ సతీమణి నిర్మల్ మృతి జ్ఞాన భారతి యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ సంతాపాన్ని తెలిపారు. సోమవారం పాఠశాల ఆవరణలో పాఠశాల కార్యదర్శి, ముఖ్య కార్య నిర్వహణ అధికారి జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, మౌనం పాటించి ఆమె ఆత్మశాంతికి ప్రార్థించారు. కార్యక్రమంలో ట్రస్టీ రమణమూర్తి, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, అదనపు పరిపాలన అధికారిని సయ్యదాసుల్తానా, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## కేదారిపురంలో సంకల్పం

**ఇచ్ఛాపురం, జులై 28(వార్త):** కేదారిపురం గ్రామంలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. రూరల్ ఎస్ఐ ఈ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా, డ్రగ్స్ వినియోగంతో అనర్థాలు గురించి వివరించారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దు ముచ్చింద్రలో వాహనాలు తనిఖీ చేపట్టారు.



# పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి



**శ్రీకాకుళం, జులై 28(వార్త):** శ్రీకాకుళం నగర పరిధిలోని పలువురిని మాజీ ఎమ్మెల్యేగుండ లక్ష్మీదేవి సోమవారం పరామర్శించారు. అరసవిల్లిలో బరాటం విష్ణు అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకొని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

18వ వార్డుకు చెందిన మాకేసు గణేష్ కంటి ఆపరేషన్ చేసుకున్నారని తెలుసుకొని వారిని పరామర్శించారు. అరసవిల్లిలోని లక్ష్మీ నగర్ కాలనీ లో జాడ సాయి మేనల్లుడు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు.



# అరకొర జీతాలతో బతుకుతున్నాం

**-సమస్యల పరిష్కారానికి కృషి చేయండి -ఎమ్మెల్సీ గాదెకు ఆర్ట్‌అండ్ క్రాఫ్ట్ టీచర్ల వినతి**



**శ్రీకాకుళం, జులై 28(వార్త):** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడును సోమవారం యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్, గుడివాడ కామేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్, వ్యాయామ ఇనస్ట్రక్టర్స్ సమస్యలు వివరించా రు. 13 ఏళ్ల నుంచి అరకొర జీతాలకు పని చేస్తున్నామని వాపోయారు. ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారిని కాంట్రాక్ట్‌లోకి మార్చడానికి కృషి చేయాలని కోరారు. ఆయన వెంట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రమేష్, ప్రధాన సలహాదారు దిలీప్‌కుమార్, టి.మల్లేష్ ఉన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 30న ఎన్‌వైకేలో ఉద్యోగ మేళా

**శ్రీకాకుళం, జూలై 28(వార్త):** జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం ఈనెల 30న శ్రీకాకుళంలోని నెహ్రూ యువ కేంద్రం వద్ద మెగా రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సుధా తెలిపారు. ఈ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో అపోలో ఫార్మసీ, నవత రోడ్డు ట్రాన్స్పోర్ట్ సంస్థలు పాల్గొని తమ ఖాళీలను భర్తీ చేసు కోనున్నాయి. అపోలో ఫార్మసీలో ఫార్మాసిస్ట్‌లు 20పోస్టులు, సేల్స్ అసోసి యేట్ 30 పోస్టులు, డెలివరీ అసోసియేట్‌లు 50 పోస్టులు, నవత రోడ్డు ట్రాన్స్పోర్ట్‌లో క్లర్కు 10పోస్టులు, డ్రైవర్ 10పోస్టులు, హెల్పర్ 10పోస్టు లకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఉద్యోగార్థులు www.ncs.gov.in వెబ్‌సైట్‌లో ముందుగానే నమోదు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు.

# వ్యవసాయానికి ప్రభుత్వ డ్రోన్ సాయం

**✳ 80 శాతం సబ్సిడీతో రైతు బృందాలకు డ్రోన్స్‌ను అందిస్తున్న కూటమి ప్రభుత్వం ✳ సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకోవాలి ✳ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**కోటబొమ్మాళి/సంతబొమ్మాళి, జూలై 28(వార్త):** ఆరుగాలం శ్రమించే రైతులకు వ్యవసాయాన్ని సులభతరం చేయాలని దేశంలోనే తొలిసారిగా కూటమి ప్రభుత్వం 80 శాతం రాయితీపై రైతులకు డ్రోన్లు అందిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో సోమవారం వ్యవసాయానికి ఉపయోగించే డ్రోన్‌ను ప్రారంభించి, డ్రోన్ పనితీరును పరిశీలించారు. అనంతరం నందిగాం మండలం నరేంద్రపురం రైతులకు డ్రోన్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాగుకు సాంకేతికతను జోడిస్తే కూలీ ఖర్చులు, సమయం ఆదా అవుతుందని అన్నారు. ఒక ఎకరంలో పురుగుమందు పిచికారీ చేయడానికి డ్రోన్‌కు ఏడు నిమిషాలు సమయం తీసుకుంటుందని చెప్పారు. అదే రైతు భుజాన వేసుకుని స్ప్రే చేయాలంటే రెండు గంటల సమయం తీసుకుంటుందని అన్నారు. ప్రతి ఒక్క రైతు కాలానుగుణంగా సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. డ్రోన్ వాడకంతో సాగు ఖర్చు తగ్గి పనులు వేగవంతం అవుతాయని తెలిపారు. పంటల పెరుగుదల, తెగుళ్ల నియంత్రణను పర్యవేక్షించడంతోపాటు దిగుబడి పెంచడానికి డ్రోన్‌లు సహాయపడతాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నమో డ్రోన్ దీదీ పథకాన్ని అమలు చేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా బ్రౌచర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు త్రినాథ స్వామి, జగన్మోహనరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు



## ఆయకట్టుకు నీరందించండి



జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వంశధార ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేవిధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ మేరకు నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఇరిగేషన్ అధికారులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వంశధార ఎడమ కాలువా పరిధిలో ఉన్న ఎత్తిపోతల పథకాల ద్వారా నీటి సరఫరాను తాత్కాలికంగా నిలుపు దల చేయలని సూచించారు. శివారు ప్రాంతాలకు సాగు నీరు అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రధానంగా పలాస, మేఘవరం, టెక్కలి, నందిగాం మండలాల పరిధిలో ఉన్న శివారు ఆయకట్టుకు నీరు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం గొట్టాబ్యారేజీ నుంచి ఎడమ కాలువ ద్వారా అందిస్తున్న 1600 క్యూసెక్కుల నీరుకు అదనంగా మరో 200 పెంచాలని సూచించారు. ఎడమ కాలువా ఆయకట్టులో పరివాహక ప్రాంతాల్లో ఉన్న మండలాలకు నినహాయించి ముందుగా దిగువ ఆయ కట్టుకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రస్తుతం నారు మళ్లు సిద్దంగా ఉన్న ప్రాంతాల్లో రైతులు నాటులు నాటువేసేందుకు వీలుగా నీరు అందించాలని చెప్పారు. ఆదిశగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. మరో వైపు కాలువలు గండ్లు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. నీటిని సజావుగా వెళ్లేందుకు పర్యవేక్షించేందుకు తాత్కలిక సిబ్బందిని నియమించుకోవాలని అన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుంగా సాగునీరు అందించడం జరుగుతుందని, కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని చెప్పారు. వంశధార ప్రాజెక్టు ఛైర్మన్ అరవల రవీంద్ర,ఈ ఇరిగేషన్ అధికారులు స్వర్ణకుమార్, బి.శేఖర్, మన్మధరావు, తదితరులు పాల్గొన్నారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ శాఖ అధికారులకు మంత్రి ఆదేశించారు.

# మెగా జాబ్ మేళాకు అనూహ్య స్పందన

**✳ 162 మందికి ఉద్యోగాలు**
**✳ నిరుద్యోగులకు ఉపాధి కల్పనకే జాబ్‌మేళాలు**
**✳ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు**



**పాతపట్నం, జూలై 28(వార్త):** నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మెగా జాబ్ మేళాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు యువత నుంచి విశేష స్పందన లభించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మహేంద్ర డిగ్రీ కళాశాల ఆవరణంలో ఈ జాబ్ మేళాను నిర్వహించింది. ఈ మేళాకు ముఖ్య అతిథిగా హాజరైన పాతపట్నం శాసన సభ్యులు మామిడి గోవిందరావు మాట్లాడుతూ, నిరుద్యోగ యువతను కంపెనీల చుట్టూ తిరిగే పరిస్థితి నుంచి బయటపెడుతూ, ప్రభుత్వమే కంపెనీలను వారి దగ్గరకు తీసుకువస్తోందని అన్నారు. యువత ఈ అద్భుత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ లక్ష్యం నిరుద్యోగ రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ జాబ్ మేళాలో మొత్తం 12 ప్రైవేటు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఉద్యోగ అవకాశాల కోసం హాజరైన 365 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, వారిలో 162 మంది యువతీ యువకులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇది నియోజకవర్గ యువతకు ఎంతగానో మేలు చేస్తుందని నిర్వాహకులు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల ఆచార్యులు మాట్లాడుతూ, నైపుణ్యాభివృద్ధి సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు యువతకు ఎంతో ఉపయోగపడుతున్నాయని ప్రశంసించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయి కుమార్ మాట్లాడుతూ, ఉద్యోగం దూరమైనా సరే అవకాశం వచ్చినప్పుడు పట్టుదలతో అందుకోవాలన్నారు. ముందుగా ఉద్యోగంలో చేరి ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని యువతకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పైల బాబ్జీ, శైలాడ సతీష్, కళాశాల కరెస్పాండెంట్ ఎస్. మధుబాబు, రామ దుర్గాప్రసాద్, జోగారావు, ఆలయ కమిటీ ఛైర్మన్ తూలుగు తిరుపతిరావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, కళాశాల సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ కార్యవర్గం ప్రమాణస్వీకారం




**శ్రీకాకుళం, జూలై 28 (వార్త):** లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సేవలకు ప్రతిరూపమని డీజీపీ డాక్టర్ జె పూర్ణచందర్రావు అన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం స్థానిక బృందావనం ఫంక్షన్ హాల్లో ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. పూర్వ గవర్నర్ వర్మ, ప్రస్తుత గవర్నర్ కేవీ సుబ్బరాజు, సున్నా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలిగా డాక్టర్ సింధూర బాధ్యతలు స్వీకరించారు. కొత్త కార్యవర్గం రామ్ గోపాల్, బరాటం కృష్ణ చైతన్య, పోకతోట సింహాచలంతో పాటు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ సింధూర అధ్యక్షతన సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేయాలన్నారు. పూర్వ గవర్నర్ వర్మ, ఉప గవర్నర్ నిన్ను శ్రీనివాసులు మాట్లాడుతూ సింధూర బృందం సేవలతో లయన్స్ క్లబ్‌కు మరింత ఆదరణ లభిస్తుందన్నారు. నటుకుల మోహన్‌రావు, పొన్నాడ రవికుమార్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతల నిర్వహణలో భాగంగా అంతా కలిసి పనిచేస్తూ ముందుకు వెళు తున్నామన్నారు. డాక్టర్ సింధూర మాట్లాడుతూ సమాజానికి అవసరమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రజల్లో మార్పు తీసుకువచ్చేందుకు, యువతను చైతన్యపరుస్తామని అన్నారు. క్యాన్సర్ రహిత జిల్లాగా నడిపించడంలో ముఖ్యపాత్ర పోషిస్తామని తెలిపారు. కార్యక్ర మంలో లయన్స్ క్లబ్ సభ్యులు రవితేజ, యువ, భారతీయ జనతా పార్టీ శ్రీకా కుళం జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, పూర్వ అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, బీజేపీ నేత పూడి తిరుపతిరావు, వివిధ సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వసతి గృహాల ఆకస్మిక తనిఖీ

**శ్రీకాకుళం, జూలై 28 (వార్త):** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు సోమవారం స్థానిక బీసీ వెల్ఫేర్ హాస్టల్, ఎస్సీ హాస్టల్, ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పిల్లల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ తనిఖీలలో భాగంగా వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి సమస్యలు, ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదవాలని, స్నేహ పూర్వ కంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ కె. ఇందిరా ప్రసాద్, ఆయా వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

## చరణ్‌కు కలెక్టర్ సన్మానం

**శ్రీకాకుళం, జూలై 28 (వార్త):** మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆకాంక్షించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం కాంస్య పతకం సాధించిన అట్టాడ చరణ్‌ను సన్మానించి అభినందించారు. థాయిలాండ్ వేదికగా ప్రతిష్టాత్మక 2వ ఏషియన్ అండర్ -16(మెన్) వాలీబాల్ చాంపియన్షిప్-2025 పోటీలు నిర్వహించారు. భారత జట్టుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున చరణ్ ప్రాతినిధ్యం వహించారు. ఈ సన్మానంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## బాలల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

**శ్రీకాకుళం, జూలై 28 (వార్త):** జిల్లాలోని ప్రతి విద్యార్థికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా వెంటనే గుర్తించి చికిత్స అందించడమే లక్ష్యమని, పైసా ఖర్చు లేకుండా పూర్తి వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అనిత తెలిపారు. ఆర్బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఇప్పిలి వెంకట్ పర్యవేక్షణలో జిల్లావ్యాప్తంగా 3,06,516 మంది విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె వెల్లడించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం కింద అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. చిన్నారుల్లో జబ్బుల లక్షణాలను తొందరగా గుర్తించి తగిన చికిత్స అందించడం, తీవ్రమైన సమస్య లున్న వారిని మెరుగైన సదుపాయాలున్న ప్రభుత్వ దవాఖానలకు తరలించడం ఈ కార్యక్రమం ఉద్దేశం అని ఆమె చెప్పారు. పరిశీలనలో భాగంగా విద్యార్థుల బరువు, ఎత్తు, దృష్టి, వినికిడి, మానసిక ఆరోగ్యం, దంతం, చర్మ సంబంధ సమస్యలు, రక్తహీనత వంటి అంశాలపై పరీక్షలు జరుగనున్నాయి. ఈ నెల 15నుంచి జిల్లాలో ఆరోగ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమం ద్వారా చిన్నతనంలోనే ఆరోగ్య సమస్యలు గుర్తించి సమయానికి పరిష్కరించడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తు ఆరోగ్యంగా ఉండేలా చేయడం ప్రభుత్వ లక్ష్యమని అధికారులు వెల్లడించారు.

## ట్రిపుల్ ఐటీ ఫిజిక్స్ విభాగాధిపతిగా శ్రీధర్

**శ్రీకాకుళం, జూలై 28 (వార్త):** శివాని ఇంజినీరింగ్ క్యాంపస్‌లో గల రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీస్ (ట్రిపుల్ ఐటీ) ఎచ్చెర్లలో ఫిజిక్స్ విభాగానికి నూతన విభాగాధిపతిగా డా.బెందాలం శ్రీధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ డైరెక్టర్ డా. బాలాజీ, పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ డా. శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, క్యాంపస్ 2 ఇన్‌ఛార్జి సాగర్, అధ్యాపకులు తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఫిజిక్స్ విద్యలో నూతన అధ్యాయాన్ని ఆవిష్కరించేందుకు డా. శ్రీధర్ అనుభవం దోహదపడుతుందని, విద్యారంగ అభి వృద్ధికి ఆయన సేవలు చాలా ఉపయోగపడతాయని వారంతా ఆకాంక్షించారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546